క్లుప్తంగా

జగనన్న గోరుముద్ద నాణ్యంగా ఉండాలి



భోజనం రుచి చూస్తున్న ఎంఈవో శామ్యూల్‌జాన్

పుల్లలచెరువు: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో అమలు అవుతున్న జగనన్న గోరుముద్దను బుధవారం ఎంఈవో శామ్యూల్‌జాన్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా ఉండాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూ అమలు చేయాలని ఆదేశించారు. భోజనం సక్రమంగా ఉంటుందా, చిక్కీ ఇస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట చేసే ప్రాంతం కూడా శుభ్రంగా ఉండాలన్నారు. మధ్యాహ్న భోజన విషయంలో రాజీ వద్దని, రోజూ ఉపాధ్యాయులు కూడా రుచి చూడాలన్నారు. పాఠశాలకు ప్రభుత్వం అందజేసిన వంట పాత్రలు వాడాలన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

గిద్దలూరు రూరల్: విద్యార్థులు ఉత్తమ భవిష్యత్తును పొందేందుకు ముందుగానే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని మార్గదర్శి జిల్లా పర్యవేక్షకుడు ఎం.రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కె.ఎస్.పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం కెరీర్ గైడెన్స్‌పై మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతి నుంచే ముందుగా మీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యను అభ్యసించాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా మీ విలువైన సమయాన్ని చదువుకునేందుకు ఉపయోగించాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు మంజురేఖ, ఉపాధ్యాయులు రమణకుమార్, వెంకటేశ్వరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పిచ్చయ్యకు గాంధీ సేవారత్న అవార్డు

గిద్దలూరు రూరల్: మండలంలోని పొదలకుంటపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్య యాదవ్ మహాత్మా గాంధీ సేవా రత్న అవార్డుకు ఎంపికయ్యారు. యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు ఆయన సేవలను గుర్తించిన మనం ఫౌండేషన్ అధ్యక్షుడు న్యాయవాది కె.చక్రవర్తి బుధవారం తెలియజేశారు. ఈ సందర్భంగా మొర్రి పిచ్చయ్య యాదవ్‌ను పలువురు ప్రముఖులు అభినందించారు.

పశుగ్రాసం, పైపులు దగ్ధం

కురిచేడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా 33 కేవీ విద్యుత్ తీగల నుంచి నిప్పురవ్వలు ఎగిసిపడటంతో 6 ఎకరాల పశుగ్రాసం కాలి బూడిదైంది. ఈ సంఘటన బుధవారం కురిచేడులో చోటుచేసుకుంది. బొనిగల చిన్న వెంకటేశ్వర్లు, నల్లబోతుల చిన్నవెంకటేశ్వర్లు, భోగ్యం వెంకటేశ్వర్లు, చిప్పగిరి శ్రీనుకు చెందిన పశుగ్రాసంతోపాటు చిప్పగిరి శ్రీనుకు చెందిన 25 నీటిపైపులు కాలిపోయాయి. సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

మార్కాపురం రూరల్: మండలంలోని పెద్ద యాచవరం ఎస్సీ కాలనీకి చెందిన బూదాల నాగమణి ఈనెల 5వ తేదీ నుంచి కనిపించడం లేదని భర్త బూదాల గురవయ్య బుధవారం మార్కాపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశాన భూములపై విచారణ

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని నాగులవరం రోడ్డులో దళితుల శ్మశాన భూమిని ఆక్రమించారన్న ఫిర్యాదుపై బుధవారం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్ విచారణ చేపట్టారు. రెవెన్యూ రికార్డులు పరిశీలించి, ఫిర్యాదుదారులతో మాట్లాడారు. తుది నివేదిక అందజేయాలని రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు.

మున్సిపల్ కమిషనర్‌గా రవీంద్ర

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ కమిషనర్‌గా డి.రవీంద్రను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న గిరికుమార్‌ను డీఎంఏ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రవీంద్ర 2018–19లో మార్కాపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు.

ఏపీజీబీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్

తర్లుపాడు: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని ఏపీజీబీ మేనేజర్ రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గాంధీ పార్కులో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని నెహ్రూ యూత్, ఉపాధ్యాయులతో కలిసి నిర్వహించారు. పార్కులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం పార్కులో మొక్కలు నాటారు. జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం ఎం.సుధాకర్, నెహ్రూ యూత్ అధ్యక్షులు పుల్లయ్య, ఏపీజీబీ సిబ్బంది, వాసవి వనిత క్లబ్ నాయకులు, విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఇంటి ముందుకే వైద్య సేవలు

- మెడికల్ కళాశాల మంజూరు చేసిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు
- ఆరోగ్య సురక్షలో ఎమ్మెల్యే కేపీ



సీతానాగులవరంలో డాక్టర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మల్లంపేటలో ఐసీడీఎస్ స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి

తర్లుపాడు: ప్రజల వద్దకు పాలన ప్రభుత్వ బాధ్యతగా భావించి అన్ని రకాల సేవలు ఇంటి ముందుకే అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సీతానాగులవరం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైద్య శిబిరాల్లో 56 రకాల పరీక్షలు నిర్వహించే పరిస్థితి మరెక్కడా లేదన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో 4 నుంచి 15 ఏళ్లలోపు పిల్లలు సుగర్ వ్యాధితో బాధపడుతున్నట్లు తల్లిదండ్రులకు తెలిపారని, పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులకు సూచించారు. జిల్లాలో వెనుకబడిన పశ్చిమ ప్రకాశానికి మెడికల్ కళాశాల మంజూరు చేసినందుకు సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కళాశాల అందుబాటులోకి వస్తుందన్నారు. అనంతరం డాక్టర్లను ఎమ్మెల్యే సన్మానించారు. ముందుగా ఎమ్మెల్యేకు సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ రేగుల అంకమ్మ, పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఎంపిపి భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, ఎంపీడీఓ ఎస్.నరసింహులు, మండల పార్టీ అధ్యక్షుడు మురారి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు దూదేకుల పెద్ద మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పొదిలి రూరల్: మండలంలోని ఏలూరు ప్రాథమికోన్నత పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఈఓఆర్డీ కృష్ణ పరిశీలించారు. ఏలూరు, సల్లూరు, నల్లారెడ్డిపాలెం గ్రామాలకు చెందిన 350 మందిని వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. పలువురికి కళ్లజోళ్లు అందించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గుజ్జుల సంజీవరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి, సర్పంచ్ తాళ్లూరి సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని నాగరాజుకుంట గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పరిశీలించారు. పేదలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ షాజిదా, సీడీపీఓ సుధామారుతి, ఎంపీపీ ఎం.మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కి దాసరి ఏడుకొండలు, ఎంపీటీసీ కామసాని భారతి శేషిరెడ్డి, సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ ఎం.శంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పెదవెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: మండలంలోని రాయవరం –1లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని డీవైఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిశోర్ కుమార్‌రెడ్డి, వైద్యులు రోహిత్ నాయక్, రియానా, విష్ణు, చైతన్యకుమార్ 507 మందికి సేవలు అందించారు.

పుల్లలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీడీవో సాయికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మల్లాపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. తహసీల్దార్ దాసు, ఎంపీడీవో మరియదాసు, ఈవోఆర్డీ శరత్ బాబు, సీడీపీవో శివలక్ష్మి, డాక్టర్లు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: మండలంలోని బసినేపల్లెలో జగనన్న సురక్ష మెడికల్ క్యాంపు బుధవారం నిర్వహించారు. వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మి, ఇమ్రాన్, వికాష్ ఆధ్వర్యంలో 515 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తహసీల్దార్ డీవీబీ వరప్రసాద్, ఎంపీడీఓ పార్వతి, పంచాయతీ కార్యదర్శి మనోరాజ్, పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్థవీడు (కంభం): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని రంగాపురంలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఎంపీపీ వెంకట్రావు, జెడ్పీటీసీ చెన్ను విజయ ముఖ్య అతిథులు హాజరై ప్రారంభించారు. స్పెషలిస్టు వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ జగదీష్, జేసీఎస్ కన్వీనర్ కృష్ణారెడ్డి, సర్పంచ్ నాగిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంభం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. స్పెషలిస్టు వైద్యులు శిబిరంలో పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కందులాపురం సర్పంచ్ బత్తుల తిరుపాలమ్మ (రజని), జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, బత్తుల సూర్యప్రకాష్, కార్యదర్శి జ్యోష్ణులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్య భద్రత లభిస్తుందని ఎంపీపీ కడప లక్ష్మి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని పొదలకుంటపల్లెలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే చేశారు. ప్రజల ఆరోగ్యం తమ బాధ్యతగా భావించిన ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని గుర్తు చేశారు. వైఎస్సార్ కంటి పథకం కింద అర్హులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఎంపీడీఓ హేమలత, కె.ఎస్.పల్లె వైద్యాధికారి నాయబ్‌రసూల్, డాక్టర్లు సుమయా, ఖాదరయ్య, వైస్ ఎంపీపీ నోబెల్, సీడీపీఓ జ్యోతి పాల్గొన్నారు.

కొమరోలు: పేదవారి కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంపీపీ కామూరి అమూల్య తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామ సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. సర్పంచ్ రమణమ్మ, తాటిచెర్ల ఎంపీటీసీ కామూరి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ డి.నరసయ్య, వైద్యనిపుణులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి జగనన్న భరోసా

దొనకొండ: ప్రజల ఆరోగ్యం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష చేపట్టారని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని మల్లంపేట గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వైద్యాధికారి కె.సునీత పర్యవేక్షణలో ప్రజలకు డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. తొలుత వైస్ ఎంపీపీ వడ్లమూడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు మహిళలు స్వాగతం పలికారు. తహసీల్దార్ ఎం.సువర్ణ, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, ఎంఈఓ ఎస్.సాంబశివరావు, జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ మురికిపూడి సుధాకర్, వైస్ ఎంపీపీలు వడ్లమూడి వెంకటేశ్వర్లు, మిట్టా కోటిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ గుంటు పోలయ్య, సర్పంచ్ పోలు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: మండలంలోని పులిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 332 మందికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ముక్కమళ్ల శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ హనుమంతరావు, మండల జేసీఎస్ కన్వీనర్ మేడికొండ జయంతి, ఏఎంసీ డైరెక్టర్ దాసరి ఏలియ్య, ఎస్సీ సెల్ నాయకులు కుంటా అచ్చారావు పాల్గొన్నారు.

తాళ్లూరు(ముండ్లమూరు): మండలంలోని నాగంబొట్లపాలెంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 438 మందిని డాక్టర్లు పరీక్షించారు. శిబిరాన్ని తహసీల్దార్ కేవీ ప్రసాద్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చిమటా సుబ్బారావు, బాపిరెడ్డి వెంకటలక్ష్మి, ఎంఎల్‌ఓ నాగమల్లేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కురిచేడు: మండలంలోని పొట్లపాడులో వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ బి.శంకరరావు, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి పరిశీలించారు. అంగన్‌వాడీ స్టాల్లో పౌష్టికాహారాన్ని రుచిచూశారు. పొట్లపాడు, గంగదొనకొండ సర్పంచ్‌లు జ్యోతిసుబ్బులు, ఆసుపల్లి రామలక్ష్మమ్మ, ఎంపీటీసీ గండి అంకమ్మ, ఏఎంసీ వైస్ చైర్మన్ కండె గంగయ్య, గంగాభవాని ఆలయ ట్రస్టు చైర్మన్ వేమా వెంకటనారాయణ, డీటీ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఏలూరులో కళ్లజోళ్లు అందజేస్తున్న అధికారులు, నాయకులు



కొమరోలు: వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ అమూల్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కడప లక్ష్మి



కంభం: కందులాపురంలో..



రోగులను పరీక్షిస్తున్న డీవైఎంహెచ్‌ఓ పద్మావతి



పొట్లపాడులో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు



పుల్లలచెరువు: మల్లాపాలెంలో..



మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న తహసీల్దార్ వరకుమార్



అర్థవీడు: రంగాపురంలో మాట్లాడుతున్న ఎంపీపీ

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూత



కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని డ్వాక్రా బజారులో డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో వైఎస్సార్ పెరటికోళ్లు, కుట్టుమిషన్లను లబ్ధిదారులకు అందించారు. మెప్మా పీడీ రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు అన్ని రాణించాలనే ఉద్దేశంతో వారి పేరుమీదనే అత్యధికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు మాటలు నమ్మి డ్వాక్రా గ్రూపులు ఆర్థికంగా నష్టపోగా.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలతో నేడు ఆర్థిక పరిపుష్టి సాధించి రుణాలు కూడా సకాలంలో చెల్లిస్తున్నారన్నారు. మార్కాపురం నియోజకవర్గంలోని తర్లుపాడులో 100 యూనిట్లు, మార్కాపురంలో 100, కొనకనమిట్లలో 75, పొదిలిలో 50 యూనిట్ల చొప్పున మొత్తం రూ.16.25 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. పీడీ రవికుమార్ మాట్లాడుతూ.. మినీ టైలరింగ్ యూనిట్ల కింద 10 మందికి రూ.5.60 లక్షలతో కుట్టుమిషన్లు, తర్లుపాడు, మార్కాపురంలో సెంట్రింగ్ యూనిట్లకు రూ.5 లక్షలు, కేకేమిట్లలో చిక్కీలు, పచ్చళ్లు, బూందీ మిక్చర్ తయారీ యూనిట్‌కు రూ.29.64 లక్షలు, పొదిలిలో సెంట్రింగ్, డైరీ యూనిట్లకు రూ.17 లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు. ఎంపీపీలు అరుణ చెంచిరెడ్డి, భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, ఎంపీడీఓ చందన, వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చేలా జగన్ పాలన



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

తాళ్లూరు (ముండ్లమూరు): ప్రజలు మెచ్చేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. బుధవారం ఆయన రెండో రోజు మండలంలోని లక్కవరంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పేదబడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్న జగనన్నకు మనమంతా అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సచివాలయాలు, వైఎస్సార్ క్లీనిక్‌లు, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో ప్రజల సమస్యలు తీర్చుతున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుని వచ్చే జనవరి నుంచి అన్ని రకాల పింఛన్లను రూ.3 వేలకు పెంచుతున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, మహిళల కోలాట నృత్యాలతో ఎమ్మెల్యే మద్దిశెట్టికి ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ యడమకంటి వెంకటేశ్వరరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు కరిముల్లా, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు యాడిక యల్లమందారెడ్డి, ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకులు కూకట్ల వీరబ్రహ్మం, నాయకులు పులి ప్రసాదరెడ్డి, లక్కవరం సర్పంచ్ నన్నం వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు రావినూతల వెంకట రమణమ్మ పాల్గొన్నారు

ఎంఈఓ రంగయ్యకు సన్మానం



రంగయ్యను సన్మానిస్తున్న సుబ్బారెడ్డి తదితరులు

పొదిలి: పదోన్నతిపై ఎంఈఓగా నియమితులైన రంగయ్య అభినందన సభ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధిలో రంగయ్య కృషి ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ తారావాణి, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కల్లం సుబ్బారెడ్డి, జి.శ్రీనివాసులు, నూర్జహాన్, కరీముల్లా బేగ్, ఉపాధ్యాయులు బీవీ రెడ్డి, యోగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ భక్తిని పెంపొందించుకోవాలి



దర్శి: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: ప్రతి ఒక్కరూ దేశ భక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ సూచించారు. బుధవారం దర్శిలో నిర్వహించిన అమృత కలశ యాత్రలో ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, ఎంపీపీ సుధాఅచ్చయ్య పాల్గొన్నారు. కలశాలను ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. కమిషనర్ మహేశ్వరరావు, ఎంపీడీఓ కుసుమకుమారి, ఈఓఆర్డీ శోభన్‌బాబు, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ షకీలా అమీన్ బాషా, జిల్లా ఎంపీటీసీల సంఘ అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు వేమిరెడ్డి చెన్నారెడ్డి, వైస్ ఎంపీపీ కొరివి మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి చూపాలి

ముండ్లమూరు: రైతులు పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి చూపాలని ఉపాధి హామీ ఏపీడీ పద్మశ్రీ సూచించారు. మండలంలోని పులిపాడులో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. వచ్చే ఏడాది గ్రామంలో చేపట్టే పనుల గురించి చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముక్కమళ్ల శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ హనుమంతరావు, ఏపీఓ మురళి, వీఆర్వో కోటయ్య, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి పాల్గొన్నారు.

ధనిరెడ్డి సేవలు అభినందనీయం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ధనిరెడ్డి వెంకటరెడ్డి సేవలు అభినందనీయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు, పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం సంఘ అధ్యక్షుడు మీనిగ శ్రీను నేతృత్వంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బూచేపల్లి వెంకాయమ్మకు ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికి సత్కరించారు. అనంతరం వెంకటరెడ్డితో, పదోన్నతి పొందిన వారిని బూచేపల్లి వెంకాయమ్మ సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌ఎం భాషా, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, ఎంపీడీఓ కుసుమకుమారి, ఎంఈఓ రమాదేవి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ బొటుకు గంగాధర్, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, రాజశేఖరం, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై నిశిత పరిశీలన

- సబ్ కలెక్టర్ సేతు మాధవన్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సేతు మాధవన్

మార్కాపురం టౌన్: మార్కాపురం సబ్‌డివిజన్ పరిధిలో ఓటరు నమోద ప్రక్రియను నిశితంగా పరిశీలించి చేర్పులు చేస్తున్నామని సబ్‌కలెక్టర్ సేతు మాధవన్ పేర్కొన్నారు. బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా తయారీలో బీఎల్‌ఓలు పారదర్శకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. త్వరలోనే రఫ్ నోటిఫికేషన్ ప్రచురిస్తామని, అభ్యంతరాలు వెల్లడించాక డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారు. ఎన్నికల అధికారి భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, జేసీఎస్ కన్వీనర్ పత్తి రవిచంద్ర, సీపీఐ నాయకులు అందె నాసరయ్య, సీపీఎం నాయకులు సోమయ్య, టీడీపీ నాయకులు సత్యనారాయణ, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి ప్రకాశం జిల్లా అధ్యక్షులైన జిల్లా కలెక్టరు Sri A.S. దినేష్ కుమార్ IAS గారి ఆదేశాలు మేరకు దరిశి మండల స్థాయిలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి సబ్ బ్రాంచ్ స్థాపించే అందుకు ఆదేశాలు జారీచేయబడింది.

దరిశి మండలానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి జీవితకాల సభ్యులతో 5-11-2023 తేదీన సర్వసభ్య సమావేశం.యం.పి.డి.ఓ కార్యాలయము నందు 11 గంటలకు నిర్వహించబడును.

ఈ సర్వసభ్య సమావేశమునకు సభ్యులు తమ సభ్యత్వకార్డులతో రావలెను. హాజరైన వారి నుండి పాలక మండలిని ఏడుగురు సభ్యులతో ఎన్నుకోవడం జరుగుతుంది. ఎన్నుకోబడిన ఏడుగురు సభ్యుల నుండి 1) చైర్మన్ 2) వైస్ చైర్మన్ 3) ట్రెజరర్ లను ఎన్నుకోబడుతారు. వీరి కాలపరిమితి 3 సంవత్సరాలుగా వుంటుంది. సబ్ బ్రాంచ్‌కు అధ్యక్షులుగా స్థానిక తహశీల్దారు వ్యవహరిస్తారు. వారు ఎంపిక చేసిన ప్రభుత్వ ఉద్యోగిని లేదా రిటైర్డ్ ఉద్యోగిని కార్యదర్శిగా వ్యవహరిస్తారు. ప్రకాశం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటి వారి నుండి నియమితులైన ఎన్నికల పర్యవేక్షణ అధికారి ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరుగుతాయి.

తేది : 04-10-2023

ఇట్లు : తహశీల్దారు, దరిశి.

సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

దొనకొండ: మండలంలోని పెదన్నపాలెం వైఎస్సార్ సీపీ నాయకుడు, సర్పంచ్ మిండాల మంగమ్మ భర్త నాగయ్య అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం సర్పంచ్ కుటుంబాన్ని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ పరామర్శించి, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ మురికిపూడి సుధాకర్, జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు వడ్లమూడి వెంకటేశ్వర్లు, మిట్టా కోటిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోధనాభ్యాస పరికరాలు అందజేత

దర్శి: బోధనాభ్యాస పరికరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బి.రమాదేవి సూచించారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు ప్రవాసాంధ్రుడు డాక్టర్ గోరంట్ల వాసుబాబు అందించిన రూ.30 వేల విలువైన పరికరాలను ఎంఈఓ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాలు, హెచ్‌ఎంలు ప్రకాశరావు, షేక్ ఖాదర్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే పరిశీలన

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రం గ్రామంలో భూముల రీసర్వేను కనిగిరి ఆర్‌డీఓ పి.అజయ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో ప్రభుత్వ అసైన్డ్, సెటిల్‌మెంట్ భూములు 6462 ఎకరాలు ఉన్నట్లు సర్వేలో గుర్తించారన్నారు. 3 రోజుల్లో పూర్తి చేస్తామని, అనంతరం హద్దురాళ్లు పాతిస్తామని ఆర్‌డీఓ తెలిపారు.